883) ఆహిరి

ప॥ కొలిచితే రక్షించే గోవిందుడితడు। యిలకు లక్ష్మికి మగడీ గోవిందుడితడు॥

చ॥ గోవర్ధనమెత్తినట్టి గోవిందుడితడు। వేవేలు గొల్లెతల గోవిందుడితడు।
కోవిదుడై ఆలగాచే గోవిందుడితడు। ఆవల కంసు జంపిన ఆగోవిందుడితడు॥

చ॥ కౄరకాళింగ మర్దన గోవిందుడితడు। వీర చక్రాయుధపు గోవిందుడితడు।
కోరి సముద్రాలు దాటే గోవిందుడితడు। ఆరీతి బాలుర దెచ్చె యాగోవిందుడితడు॥

చ॥ కుందనపు కాశతోడి గోవిందుడితడు। విందుల రేపల్లె గోవిందుడితడు।
పొంది శ్రీవేంకటాద్రిపై పొసగ తిరుపతిలో। అందమై పవ్వళించిన ఆ గోవిందుడితడు॥